క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ

భైంసాటౌన్‌: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ బుచ్చయ్య, అధ్యాపకులతో కలిసి ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 25 నుంచి 31 వరకు మండలంలోని వాటోలిలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఉంటుందని.. వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ కోరారు. వైస్ ప్రిన్సిపాల్ రఘునాథ్, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు



ఓలా మార్గంలో మొరం పోయిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కుంటాల: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో ని రోడ్లు దెబ్బ తి న్నా యి. దీనిపై ఈనెల 11న 'సాక్షి'లో ఈ రోడ్లకు మరమ్మతులు చేపట్టలే.. శీర్షికన కథనం ప్రచురితమవగా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. రూ.లక్ష ఎఫ్‌డీఆర్ నిధులు వెచ్చించి అందకూర్, ఓలా, సూర్యాపూర్ గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టారు.

సోయా బస్తాలు ఎత్తుకెళ్లారు



యార్డు వద్ద సోయా పంట బస్తాలు

కుభీర్: మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిల్వ చేసిన సోయా పంట బస్తాలను దుండగులు ఎత్తుకెళ్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. బుధవారం అర్ధరాత్రి కుభీర్‌కు చెందిన పడిపెల్లి గంగాధర్, నార దత్తాత్రి, బార్ద గణేశ్ ఒ క్కో బస్తాను మొత్తం ఒకటిన్నర క్వింటాళ్ల పంటను ఎత్తుకెళ్లారు. మార్కెట్ అధికారులు సీసీ కెమెరాలను బాగు చేసి వాచ్‌మెన్‌ను నియమించాలని రైతులు కోరురుతున్నారు. ఈ విషయమై మార్కెట్ కార్యదర్శి రాజేశ్వర్‌ను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా సీసీ కెమెరాలకు ఇటీవల మరమ్మతులు నిర్వహించి రైతులకు టార్పాలిన్లు అందించినట్లు పేర్కొన్నారు.

'తొలిమెట్టు' సామర్థ్యాలు పరిశీలన



విద్యార్థితో మాట్లాడుతున్న డీఈవో భోజన్న

నిర్మల్‌రూరల్: మండలంలోని కొట్ల(కె) ప్రాథమిక పాఠశాలను గురువారం డీఈవో భోజన్న సందర్శించారు. విద్యార్థుల తొలి మెట్టు(ఫౌండేషన్, లిటరసీ, న్యూమరసీ) విద్యా సామర్థ్యాలు, ఉపాధ్యాయుల ఎఫ్‌ఆర్‌ఎస్ ప్రక్రియ, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. తరగతులకు వెళ్లి విద్యార్థుల తొలిమెట్టు సామర్థ్యాలను పరిశీలించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెనూ ప్రకారం భోజనం అందించాలని పేర్కొన్నారు. ఇన్‌చార్జి హెచ్ఎం షాహిదా పర్వీన్, ఉపాధ్యాయులు లత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో వైద్యశిబిరం



పరీక్షిస్తున్న వైద్యురాలు ఫర్జానా బేగం

లక్ష్మణచాంద: బాలశక్తి కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలోని కేజీబీవీలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 330 మంది విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఇద్దరు ఎనీమియా, ముగ్గురు థైరాయిడ్‌తో బాధపడుతున్నట్లు వైద్యురాలు ఫర్జానా బేగం తె లిపారు. పరిశుభ్రత పాటిస్తూ పోషకా హా రం తీసుకోవాలని సూచించారు. ఎస్‌వో నవిత, ఫార్మసిస్టు శశిధర్, ఏఎన్‌ఎం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు జయప్రదం చేయాలి

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో ఉన్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ 41వ వార్షిక బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు అడ్డగట్ల రాజన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం కోరారు. గురువారం పట్టణంలోని ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. నవంబర్ 1 నుంచి ఆరో తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు భక్తులు తరలిరావాలని కోరారు. అర్చకులు నర్సింహమూర్తి, కమిటీ సభ్యులు, నాయకులు రమేశ్, సురేశ్, సత్యం, లింగాల రాము, భీమన్న, రాజు, లక్ష్మణ్ తదితరులున్నారు.

చిగురిస్తున్న ఆశలు..

- 15 ఏళ్లుగా అలంకారప్రాయంగా మన్మద్ ఎత్తిపోతల పథకం
- మరమ్మతులకు నిధులు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



నిరుపయోగంగా మన్మద్ ఎత్తిపోతల పథకం



కాలిన మోటార్లు

లోకేశ్వరం: బీడు భూములను సాగులోకి తీసుకొచ్చేందుకు నిర్మించిన ఎత్తిపోతల పథకాలు నిర్వహణ లేక పలు చోట్ల వృథాగా మారాయి. మండలంలోని మన్మద్ ఎత్తిపోతల పథకం ఏళ్లుగా నిరుపయోగంగా మారడంతో దాని మోటార్లు, కాల్వలు దెబ్బతిన్నాయి. తాజాగా ప్రభుత్వం ఎత్తిపోతల పథకం మరమ్మతులకు రూ.1.61 కోట్ల నిధులు మంజూరు చేయడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి. దీనిపై కథనం

15 ఏళ్లుగా నిరుపయోగమే..

లోకేశ్వరం మండలంలోని మన్మద్ గ్రామ శివారులో సుద్దవాగును ఆనుకొని 2010 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం రూ.8 కోట్ల 60 లక్షలతో ఎత్తిపోతల పథకం పనులు చేపట్టారు. రెండు 45 హెచ్‌పీ, రెండు 110 హెచ్‌పీల సామర్థ్యం కలిగిన నాలుగు మోటార్లను ఏర్పాటు చేశారు. అధికారులు, ఎత్తిపోతల పథకం కమిటీ సభ్యుల పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్ నిబంధనలు పాటించలేదు. దీంతో పనులు పూర్తయ్యేసరికి మరో నాలుగేళ్లు గడిచింది. తీరా 2014లో ప్రారంభిస్తే అన్నీ లీకేజీలే దర్శనమిచ్చాయి. ఈ పథకం ద్వారా ఎకరాకు కూడా సాగు నీరు అందించలేదు. నిర్వహణ సక్రమంగా లేక 15 ఏళ్లుగా నిరుపయోగంగానే ఉంది.

ఆనవాళ్లు కోల్పోయిన కాల్వలు

ఏళ్లుగా పంపుహౌజ్ మోటార్లు వృథాగా ఉండటంతో పనికి రాకుండా పోయాయి. దీనికి కుంటాల మండలం కల్లూర్ ఉపకేంద్రం నుంచి కరెంట్ సరఫరా చేయగా.. ఇప్పుడు విద్యుత్ స్తంభాలు, తీగలు ఆనవాళ్లు కోల్పోయాయి. ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు నీరందించే ప్రధాన కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగాయి. గడెన్నవాగు ఉధృతికి ఎత్తిపోతల పథకం పంపు హౌస్‌లోకి నీరు చేరడంతో మోటార్లు, విద్యుత్ తీగలు దెబ్బతింటున్నాయి. అధికారులు స్పందించి ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి యాసంగికీ నీరందించాలని రైతులు పేర్కొంటున్నారు.

త్వరలో టెండర్ ప్రక్రియ

మన్మద్ ఎత్తిపోతల పథకం మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే టెండరు ప్రక్రియ పూర్తవుతుంది. వీలైనంత త్వరగా పనులు ప్రారంభిస్తాం. ఆయకట్టు భూములక సాగు నీరు అందించేలా చర్యలు తీసుకుంటాం.
– అనిల్, నీటిపారుదలశాఖ, డీఈ, భైంసా

మరమ్మతులు ప్రారంభించాలి



ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరై మూ డు నెలలు గడుస్తోంది. టెండర్ ప్రక్రియ పూర్తి చే సి మరమ్మతులు నాణ్యతతో చేపట్టాలి. యాసంగికి నీరందుతుందనే కొండంత ఆశతో ఎదురుచూస్తున్నాం.
– శంకర్‌గౌడ్, మన్మద్

రైతులకు మేలు



ఎత్తిపోతల పథకం వద్ద చెక్ డ్యాం నిర్మిస్తే పథకం పని చేయడమేకాక భూగర్భజలాలు పెరుగుతాయి. అధికారులు పథకం ద్వారా సాగునీరు అందిస్తే రైతులకు మేలు జరుగుతుంది.
– రాజలింగం, ఎత్తిపోతల పథకం చైర్మన్, మన్మద్

టపాసులతో జాగ్రత్త

- జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి ప్రభాకర్



జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్

నిర్మల్‌టౌన్: దీపావళి వెలుగుల పండగ. చిన్నాపెద్ద తేడా లేకుండా ఇంటిల్లిపాది ఆస్వాదించే ఆనందాల వేడుక. టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తగా ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్ సూచిస్తున్నారు. ఈమేరకు 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన క్రాకర్స్ దుకాణాలు, ఇంట్లో వారు టపాసులు కాల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు సూచనలు ఆయన మాటల్లో..

దుకాణదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ..

టపాసుల దుకాణాలు జనావాసాల మధ్య ఏర్పాటు చేయవద్దు. ఒక షాపులో 100 కిలోల కన్నా తక్కువ క్రాకర్స్ ఉండాలి. ఒక్కో షాప్ మధ్య మూడు మీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలి. మూడు బకెట్ల ఇసుక, రెండు అగ్నిమాపక సిలిండర్లను ఉంచాలి. ప్రతీషాపు వద్ద 200 లీటర్ల నీళ్ల సామర్థ్యం కల్గిన రెండు డ్రమ్ములను ఏర్పాటు చేసుకోవాలి. 18 ఏళ్లకన్నా తక్కువ వయసున్న వారు టపాకాయల షాప్‌లో ఎక్కువసేపు ఉండొద్దు. విద్యుత్ తీగలను పైపుల ద్వారా ఏర్పాటు చేయాలి. దుకాణాల సమీపంలో ధూమపానం నిషేధం. నిర్మల్‌లో 65, భైంసాలో 27, ఖానాపూర్‌లో 10, కుభీర్‌లో 3 షాపులకు అనుమతిచ్చాం.

కాల్చేటప్పుడు ..

టపాసులు కాల్చే సమయంలో పిల్లలను ఒంటరిగా వదలద్దు. ప్రమాదకర బాణసంచా జోలికి వెళ్లకపోవడం ఉత్తమం. శానిటైజర్ పూసుకున్న చేతులతో టపాసులు కాల్చొద్దు. పొగ ఎక్కువగా వచ్చే వాటిని వాడకండి. విద్యుత్ స్తంభాలు, తీగల వద్ద టపాసులు పేల్చొద్దు. నైలాన్ దుస్తులు ధరించి టపాసులు కాల్చొద్దు. టపాకాయలు కాల్చే సమయంలో ముఖం దగ్గరగా పెట్టకూడదు. ముందు జాగ్రత్తగా బకెట్లతో నీటిని, ఫస్ట్ ఎయిడ్ కిట్ దగ్గర ఉంచుకోవాలి. ఇంట్లో కాకుండా బయట టపాసులు కాల్చాలి. డ్రైనేజీల వద్ద టపాసులు పేల్చకూడదు.

అత్యవసర వేళ సంప్రదించండి ..

దీపావళి వేళ ప్రమాదం జరిగితే మొదటగా ఫైర్ ఇంజిన్ నంబర్–101కు అంబులెన్స్ 108కి కాల్ చేసి సమాచారం అందించాలి. ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పి ప్రాణాలను రక్షిస్తారు. వీటితోపాటు నిర్మల్ ఫైర్ స్టేషన్ 87126 99218, భైంసా–87126 99220, ఖానా పూర్–87126 99222 నంబర్లలో సంప్రదించవచ్చు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఎవరైనా అనుమతులు లేకుండా షాపులు ఏర్పాటు చేస్తే అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. వెంటనే నోటీసులు పంపుతాం. నిబంధనలు ఉల్లంఘించి ప్రమాదాలకు కారణం కావద్దని సూచించారు.

ప్రైవేటు టీచర్లకు కలాం అవార్డులు



పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులు

నిర్మల్: జిల్లాకు చెందిన పన్నెండు మంది ప్రైవేటు ఉపాధ్యాయులు ప్రతిష్టాత్మక అబ్దుల్‌కలాం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి పురస్కరించుకొని కలాం ఫౌండేషన్, లీడ్ ఇండియా సంస్థలు బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాయి. ఇందులో జిల్లాకు చెందిన ప్రైవేటు ఉపాధ్యాయులు గులాబ్‌సింగ్‌రాథోడ్, డి.శ్రీకాంత్, ప్రదీప్, ప్రవీణ్‌కుమార్, నరసింగ, ఎ.శ్రీనివాస్, నిఖిత, భారతీదేవి, సాయన్నయాదవ్, హరీశ్‌కుమార్, అజ్మత్‌అలీ, శిరీష ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, కేంద్ర రక్షణసలహాదారు, డీఆర్‌డీఓ మాజీ డైరెక్టర్ సతీశ్‌రెడ్డి, లీడ్ ఇండియా వ్యవస్థాపకుడు సుదర్శన్ ఆచార్యల చేతుల మీదుగా వీరు అవార్డులు స్వీకరించారు. ఈనేపథ్యంలో తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(ట్రస్మా) జిల్లా బాధ్యులు, ఆయా పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థులు హర్షం వ్యక్తంచేశారు.

'బంద్ విజయవంతం చేయాలి'



నిర్మల్‌లో మాట్లాడుతున్న రాజన్న

ఖానాపూర్: ఈనెల 18న బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ సంఘాల జేఏసీ తలపెట్టిన రాష్ట్రబంద్‌లో అన్నివర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు నంది రామయ్య కోరారు. గురువారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ సంఘాల రాష్ట్ర బంద్‌కు సీపీఐఎంఎల్ మాస్‌లైన్(ప్రజాపంథా) మద్దతు ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును గవర్నర్, రాష్ట్రపతి ఆమోదించని వైఖరిని నిరసిస్తూ, జీవో నెంబర్ 9 ఆర్డినెన్స్‌పై హైకోర్టు స్టే విధించడాన్ని వ్యతిరేకిస్తూ బీసీ సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. కార్యక్రమంలో నాయకులు జక్కుల రాజన్న, అడ్డగట్ల శంకర్, దాసండ్ల సుదర్శన్, కుర్మ రాజన్న, గోరె బాయ్, శ్రీనివాస్, రాజు తదితరులు ఉన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కె.రాజన్న అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 18 న నిర్వహించే తెలంగాణ బంద్‌కు మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీలు బీసీలను మోసం చేసేలా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. నిధులు రాక గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిందన్నారు. సీఎం.. బీసీలకు రిజర్వేషన్ల విషయమై రాష్ట్ర గవర్నర్ ఆమోదం పొంది ఎన్నికలకు వెళ్లాలని కోరారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి, ఎస్.లక్ష్మి, నాయకులు బక్కన్న, రామలక్ష్మణ్, గంగన్న, రావుఖాన్, గఫూర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే పంట విక్రయించాలి

- నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి



సోన్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

సోన్/లక్ష్మణచాంద: రైతులు మొక్కజొన్న పంటను కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2400 పొందాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని మంజులాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోన్‌లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించి మాట్లాడారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోళ్లు చేపడుతున్నట్లు వివరించారు. అంతకుముందు లక్ష్మణచాందలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేశ్‌రెడ్డి , ఏడీఏ విద్యాసాగర్, ఏవో వినోద్‌కుమార్, సీఈఓ శ్రీహరి, బీజేపీ మండల అధ్యక్షుడు మార గంగారెడ్డి, జక్క రాజేశ్వర్, రాము, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి గురువారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.ఐదు లక్షలతో ఎల్‌ఐసీ ఏజెంట్ల సంఘ భవన ప్రహరీకి, దివ్యనగర్‌లో రూ.5లక్షలతో చేపట్టే వశిష్ఠ యోగ సంఘటన్ భవనం, మున్నూరుకాపు సంఘ భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, మెడిసెమ్మె రాజు, ఆకుల కార్తీక్, సుంకరి సాయి, అరవింద్, జుట్టు దినేష్, శ్రీరామోజు నరేశ్, మున్నూరుకాపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం



భోసిలో సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులు

తానూరు: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని టీఎస్ యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్ అన్నారు. గురువారం మండలంలోని భోసి, బెల్‌తరోడా, బోరిగాం, తానూరు కేజీబీవీ, కోలూరు, కోలూరుతండ, మసల్గాతండా, మొగ్లి గ్రామాల్లోని పాఠశాలల్లో టీఎస్ యుటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో తనిఖీల కోసం ఉపాధ్యాయులను బృందాలుగా ఏర్పాటు చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పుట్ట రవికిరణ్, పి.భోజన్న, షేక్ ఫాజిల్, నవీన్‌కుమార్, రవి, చందు తదితరులు పాల్గొన్నారు.

కొత్తమద్దిపడగలో డీపీవో విచారణ



విచారిస్తున్న డీపీవో శ్రీనివాస్

కడెం: మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామ పంచాయతీ కార్యదర్శిపై గతనెల 1న కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. డీపీవో శ్రీనివాస్ గురువారం గ్రామాన్ని సందర్శించి, విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్‌పై పలువురు గ్రామస్తులు ఆరోపణల నేపథ్యంలో గ్రామస్తుల సమక్షంలో జీపీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని డీపీవో శ్రీనివాస్ తెలిపారు.

జీవాలకు టీకాలు వేయించాలి

కుంటాల: మండలంలోని అంబకంటి, అంబకంటి తండాలో గురువారం మూగజీవాలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశువైద్యాధికారి ప్రియాంక మాట్లాడుతూ పశుపోషకులు టీకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది భరత్ భూషణ్, నరేందర్, శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పశుపోషకులు జీవాలకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశు వైద్యాధికారి అయిట్ల రాజేశ్వర్ అన్నారు. గురువారం పట్టణంలోని గాంధీనగర్ శివారు గోశాల వద్ద జీవాలకు టీకాలు వేయించారు. ఏడీ ఏహెచ్ఎస్.రామచంద్రుడు, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలలు తనిఖీ

లోకేశ్వరం: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో చంద్రకాంత్.. ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని అబ్దుల్లాపూర్, జోహర్‌పూర్, వట్టోలి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో పరిశీలించి మాట్లాడారు. ఆవరణ, కిచెన్‌గార్డెన్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. హెచ్ఎంలు శ్రీనివాస్, మురళీధర్ తదితరులు ఉన్నారు.

కేంద్రం ఏర్పాటుకు వినతి

కుంటాల: మండలంలోని లింబా (కె)లో సోయా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌కు భైంసాలోని తన నివాసంలో నాయకులు, రైతులు వినతిపత్రం అందజేశారు. కొనుగోలు కేంద్రం లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొనగా.. కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఆత్మ డైరెక్టర్ మహేందర్, రైతులు శ్రీకర్‌రెడ్డి, గౌతమ్, వినాయక్ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక దందా ఆపేదెవరు..?



గురువారం పట్టణ శివారులోని రెంకోని వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్



పట్టణ శివారులో ఇసుక డంప్

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది. వాగుల నుంచి ఇసుక తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లలో ఇసుకను విక్రయిచడంతోపాటు పట్టణ, గ్రామ శివార్లలోని చెట్ల మధ్యన డంప్ చేస్తున్నారు. పట్టించుకునే వారు లేకపోవడంతో ఈ దందా అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని అక్రమ ఇసుక దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'రైతులంటే చిన్నచూపు తగదు'

భైంసాటౌన్: రైతులంటే ప్రభుత్వానికి, అధికారులకు చిన్నచూపు తగదని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని ఏఎంసీ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్ రైతుల సమస్యలు, సోయా, ఇతర పంటల కొనుగోళ్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమస్యలపై చర్చించేందుకు గురువారం ఉదయం 11 గంటలకు ఏఎంసీ కార్యాలయానికి రమ్మని చెప్పి, తాము లేకుండానే ముందస్తుగా సమావేశం ముగించారని ఆవేదన వ్యక్తం చే శారు. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక రైతులు తమ పంటను వ్యాపారులకు అమ్ముకొని క్వింటాకు రూ.1300 వరకు నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీకేఎస్ ముధోల్ మండల అధ్యక్షుడు సాయిప్రసాద్, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, తా నూర్ మండలాధ్యక్షుడు రవీందర్ రెడ్డి ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కుభీర్: మండలంలోని కుప్టి, నిగ్వా, హంపోలి, సిర్పెల్లి గ్రామాల్లో పలువురు మృతి చెందగా బాధిత కుటుంబాలను గురువారం ముథోల్ మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి పరామర్శించారు. కుప్టిలో బోయిడిరాజు, కండక్టర్ సుధాకర్, నిగ్వాలో శ్రీరాం పటేల్, హంపోలీలో సాయినాథ్, సిర్పెల్లిలో ధర్మపురి, సత్యనారాయణ కుటుంబాలను పరామర్శించారు. ఆ యన వెంట మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కల్యాణ్, మాజీ సర్పంచ్‌లు ఆనంద్, విజయ్, రఘురాంపటేల్ ఉన్నారు.

వైద్య శిబిరం

ముథోల్: మండలకేంద్రంలోని పశుపతినాథ్ శివాలయ మండపంలో భైంసాకు చెందిన ఆరాధన ఆయుర్వేద వెల్నెస్ రిసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యురాలు జూలీ 100 మంది రోగులను పరీక్షించి మందులు అందించారు. వైద్యులు వేదాంత్‌పాటిల్, బీడీసీ అధ్యక్షుడు వరగంటి విఠల్, మున్నూరు కాపు సంఘం తాలూకా అధ్యక్షుడు వరగంటి విఠల్, మున్నూరు కాపు సంఘం తాలూకా అధ్యక్షుడు రోళ్ల రమేశ్, బీడీసీ ఉపాధ్యక్షుడు పల్లె నాగేష్, జిందంవా ర్ వెంకటేశ్, ఆసుపత్రి పర్యవేక్షకుడు పి.శ్రీనివాస్, సిబ్బంది గణేశ్, పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన వీవోఏలు

కుంటాల: మండలంలోని ఐకేపీలో పని చేస్తున్న వీవోఏలు గురువారం హైదరాబాద్‌లో తలపెట్టిన చలో సెర్ప్ కార్యక్రమానికి వెళ్లారు. కనీస వేతనం నెలకు రూ.20వేలు, 58 జీవో రద్దు, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ తలపెట్టిన కార్యక్రమానికి బయలుదేరి వెళ్లినట్లు మండల కన్వీనర్ మహేశ్ వెల్లడించారు. కార్యదర్శి మట్ట గజ్జారాం, షేక్ హసీనా, జాదవ్ సంపత్ పాల్గొన్నారు.

సాయిబాబాకు పూజలు

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్న హారతిలో భక్తులు పాల్గొని బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

వైద్యసిబ్బంది సర్వే

బాసర: బోధకాలు (ఫైలేరియా)ను నిర్మూలించేందుకు వైద్యులు మండలంలోని పలు కాలనీల్లో వైద్యసిబ్బంది సర్వే చేపట్టారు. బాసర పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రభాకర్, సూపర్‌వైజర్ సునంద పలు కాలనీల్లో తిరుగుతూ పలువురికి పరీక్షలు చేసి మాత్రలు అందించారు.

అదనపు విద్యుత్ కోతలతో ఇక్కట్లు

ఖానాపూర్: పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రకటించిన అధికారులు మరో గంటకు పైగా అదనంగా విద్యుత్ కోత విధించడంపై వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సెల్ టవర్లకు విద్యుత్ సరఫరా లేక నెట్‌వర్క్‌లకు సిగ్నల్ సమస్య తలెత్తింది. సాయంత్రం 5 దాటాక గంటన్నర పాటు విద్యుత్ రాక వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. పండుగ వేళ విద్యుత్ నిలిపి వేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు ఎమ్మెల్యే రాక

లోకేశ్వరం:మండలకేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ఉదయం 11 గంటలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని తహసీల్దార్ భోజన్న ఒక ప్రకటనలో తెలిపారు. 65 మంది లబ్ధిదారులు, అధికారులు, నాయకులు రావాలని కోరారు.

బాసర: మండలకేంద్రంలోని రైతువేదికలో శు క్రవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే రామారావు పటేల్ లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తారని తహసీల్దార్ పవన్‌చంద్ర ఓ ప్రకటనలో తెలిపారు.

కుంటాల: మండలకేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ఉదయం 10 గంటలకు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసే కార్యక్రమానికి ఎమ్మెల్యే రామారావు పటేల్ వస్తారని తహసీల్దార్ ఆడె కమల్ సింగ్ తెలిపారు. లబ్ధిదారులు హాజరుకావాలని ఆయన కోరారు.